సంపుటి :02 సంచిక :81 పేజీలు :05
వెల ₹5
# అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
శుక్రవారం 09, మే 2025

ఉష్ణోగ్రతలు
కనిష్ఠం : 27
గరిష్ఠం : 38

## ఎస్టీల అభ్యున్నతికి ఇందిరా సౌరగిరి



- నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి శ్రీకారం
- ఆర్వోఎఫ్ భూముల సాగుకు సర్కార్ చేయూత
- ఈ నెల సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- గిరిజనులకు : లబ్ది ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

05

## తెలంగాణ జిల్లాల్లో జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు

05

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



## మిర్చి ధర క్వింటాకు రూ.10,374



- ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులకు శుభవార్త
- 'ఎంఐఎస్' పథకం అమలు చేయనున్న కేంద్రం
- బహిరంగ మార్కెట్‌లో ధర తక్కువగా ఉంటే.. రైతుకు కేంద్రమే భర్తీ
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన

05



## జగన్నాటకం!

- అభివృద్ధికి ఆమడ దూరం... మల్లక్కపేట ఆలయం
- హుండీ ఆదాయం తక్కువ, పర్సనల్ ఆదాయం ఎక్కువ
- అన్నీ తానై వ్యవహరిస్తున్న అయ్యగారు
- పట్టించుకోని దేవదాయ శాఖ

03

అక్షరదర్బార్, పరకాల: పరకాల ప్రాంతంలో కొంగుబంగారంగా కొలిచే ఆరాధ్య దైవం శ్రీ మల్లక్కపేట ఆంజనేయస్వామి ఆలయం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటుంది. ఆలయానికి భక్తులు వేల సంఖ్యలో వస్తే ఆలయానికి వచ్చే హుండీ ఆదాయం మాత్రం రూ.వందల్లో మాత్రమే కనబడుతుంది. ఈ క్రమంలో ఎక్కువ ఆదాయం ఒకరి చేతుల్లోకే పోతుందని ఇక్కడ టాక్. గుడి ఆయనదే.. ఆదాయం ఆయనదే అనే నినాదం పరకాల మండలంలోని మల్లక్క పేట శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో వినపడుతుంది.

## సాక్షి ఎడిటర్‌పై దాడిని ఖండించిన పాత్రికేయులు



హనుమకొండ జిల్లా కేంద్రంలో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నిరసన

05



# ప్రెజర్ బాంబ్ బ్లాస్ట్ తిరుమలగిరిలోనే ఫస్ట్!

- మూడు దశాబ్దాల క్రితమే సంచలనం
- బ్లాస్టింగ్‌లో ఇద్దరు సామాన్యులు మృతి
- అప్పటి ఎస్సై రవీందర్ రెడ్డికి గాయాలు
- ఏఎస్సైకి తృటిలో తప్పిన ప్రమాదం
- కర్రెగుట్టల్లో కూంబింగ్ నేపథ్యంలో మరోసారి ప్రెజర్ బాంబ్‌పై చర్చ

04

భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో ఘటన





వంట చేసుకునేందుకు కట్టెలు సేకరించేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లి నాగరాజు అనే ఆదివాసీ ప్రెజర్ బాంబుపై కాలు వేశాడు. పెద్ద బ్లాస్టింగ్ సంభవించింది. నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ ఘటన 2025 జనవరి 5న ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలం వీరభద్రవరంలో జరిగింది. ఆ తర్వాత వెంకటాపురం, వాజేడు మండలాల పరిధిలో ప్రెజర్ బాంబులు పేలి పలువురు గాయపడ్డారు. తాజాగా ఆపరేషన్ కర్రెగుట్టలో భాగంగా కొద్ది రోజుల క్రితం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో కర్రెగుట్టపై ప్రెజర్ బాంబ్ పేలి ఓ జవాను ప్రాణాలు కోల్పోయాడు. ఇటీవల మావోయిస్టులు తెలంగాణ, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న కర్రెగుట్టపై ప్రెజర్ బాంబులను అమర్చామని, పోలీసుల మాటలు విని ప్రజలెవరు కర్రెగుట్టపైకి రావద్దని మావోయిస్టు పార్టీ ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో ఓ లేఖ విడుదలైంది. ఈ క్రమంలో తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో పోలీసుల కూంబింగ్ మొదలైంది. ఇక్కడ భద్రతా దళాలు ఉధృతంగా 'ఆపరేషన్ కగార్' ను కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు.. ప్రెజర్ బాంబ్ అంటే ఏమిటి..? తెలుగు ప్రాంతంలో మొదటి సారి ప్రెజర్ బాంబ్ ఎక్కడ పేలింది.. ? దాన్ని ఎవరు పేల్చారు..? ప్రాణ నష్టం ఏమైనా సంభవించిందా? అనే విషయం తెలుసుకోవాలంటే ఈ కథనం పూర్తిగా చదవాల్సిందే.. - అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి

# కొలతల ప్రకారం పనులు జరగాలి


అక్షర దర్బార్, ఆత్మకూర్: ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ గ్రామ పంచాయితీ లో జరిగే ఉపాధి హామీ పనులను డీఆర్ డీఓ మేక శీను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్ డీఓ మేక శీను మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో ఉన్న జాబ్ కార్డుల ఆధారంగా ఎక్కువ మంది కూలీలు ఉపాధి హామీ పనుల్లో పాల్గొనేలా చూడాలన్నారు. ప్రతిరోజు 300 నుండి 307 కూలీ వచ్చే విధంగా కొలతలు ఇచ్చి కొలతల ప్రకారం పనులు జరిగేలా చూడాలన్నారు. 300 రూపాయలకు తగ్గకుండా కొలతల ప్రకారం పనిచేయాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఉదయం 6 గంటల లోపు పని ప్రదేశంలో ఉండి కొలతల ప్రకారం ఎండ తీవ్రత ఎక్కువ కాకముందే పనులు ముగించుకోవాలన్నారు. కొలతలు ప్రకారం తక్కువ పని జరిగినట్టయితే సాయంత్రం వేళల్లో వచ్చి మిగతా పని పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు తగు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ డి. రాజిరెడ్డి, ఈసీ జి. రాము, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, టి ఏ సురేష్, రాజుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

## డీఈఓ ముద్దమల్ల రాజేందర్




– అక్షర దర్బార్ మొగుళ్లపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ తెలిపారు. శుక్రవారం మొగుళ్ళపల్లి మండలంలోని పిడిసిల్ల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మహ్మద్ సాదిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రతి సబ్జెక్టులో తగిన అర్హతలతో మంచి అనుభవం గల ఉపాధ్యాయులచే అన్ని ప్రభుత్వ పాఠశాలలో బోధన అందిస్తున్నామన్నారు. (ఐఎఫ్పీ)ప్యానల్ బోర్డుతో విద్యార్థులకు పరిపూర్ణమైన అవగాహనను కల్పిస్తూ, ప్రతి అంశాన్ని కళ్ళకు కట్టినట్టు విద్యబోధన జరుగుతుందన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ఏఐ (కృత్రిమ మేధ) తో కూడా విద్య బోధన అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం, మధ్యాహ్న భోజన పథకంలో పౌష్టిక ఆహారం, ఉదయం రాగి జావా, ఉచిత పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు, 10వ తరగతి విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం ప్రత్యేక తరగతుల బోధన, ఆ సమయంలో విద్యార్థులకు స్నాక్స్ కూడా అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు విశాలమైన ఆట స్థలంలో వారి ఆసక్తికి అనుగుణంగా వ్యాయామము ఉపాధ్యాయులచే వివిధ రకాల ఆటలు ఆడిస్తూ వారి మానసిక, శారీరక పెరుగుదలకు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి సాదిక్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ బడి ఈడు పిల్లలను, ప్రవేట్ పాఠశాలకు వెళ్తున్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిడిసిల్ల ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ చేపించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి, జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సామల రమేష్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ దుప్పటి రాజగోపాల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు శోభ, అంగన్వాడి సిబ్బంది, తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు,

# అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

## సోషల్ మీడియా పై పోలీసు నిఘా

### చిట్యాల సీఐ దగ్గు మల్లేష్



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోషల్ మీడియాలో అసత్యపు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సోషల్ మీడియా పై పోలీసులు నిరంతర నిఘా ఉంటుందని చిట్యాల ఇన్ స్పెక్టర్ మల్లేష్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మల్లేష్ మాట్లాడుతూ భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఎటువంటి గొడవలకు తావిచ్చే మెసేజ్ లు సోషల్ మీడియాలో పోస్ట్ చేయరాదని, అసత్యాలను ప్రచారం చేయరాదని అన్నారు. అందరూ శాంతియుతంగా ఉండాలని కోరారు. రానున్న బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల సర్కిల్ పరిధిలోని ఎస్సైలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తనిఖీ



అక్షర దర్బార్ మొగుళ్లపల్లి: మొగుళ్ళపల్లి మండల పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరు నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోని వడ్లను కొనుగోలు చేసేట్టప్పుడు నిర్ణీత ప్రామాణిక పద్ధతులను రైతులు పాటించాలని అన్నారు. తేమ శాతం 17శాతం దాటి ఉండకూడదని సూచించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని, ధాన్యం తడవకుండా తగు జాగ్యాత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రీ గురించి అడిగి తెలుసుకున్నారు. భూమి ఉన్న ప్రతి ఒక రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి పి. సురేందర్ రెడ్డి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదులను ఏరి వేయాలి

## చిట్యాలలో ముస్లింల ర్యాలీ

అక్షర దర్బార్ చిట్యాల : అమాయకుల ప్రాణాలు తీస్తూ వీరు చేష్టలు చేస్తూ టెర్రరిస్టులకు తీవ్రవాదులకు నిలయంగా మారిన పాకిస్తాన్ ఉగ్రవాదులను కూకటివేళ్లతో ఏరివేయాలని ముస్లిం నాయకులు అన్నారు. శుక్రవారం చిట్యాల మండల కేంద్రంలోని కౌసర్ ఏ మసీదులో నమాజ్ తరువాత ముస్లిం సోదరులందరూ పాల్గొని పాకిస్తాన్ డౌన్ డౌన్ భారత్ మాతాకీ జై అనే నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా మండల కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రాజ్ మహమ్మద్ మాట్లాడుతూ ఏప్రిల్ 22వ తేదీన పాకిస్తాన్ ఉగ్రవాదులు జమ్ము కాశ్మీర్ లోని పహల్గాంలో విహారయాత్రకు వెళ్లిన అమాయకులైన 26 మందిని కాల్చి చంపారన్నారు. దానికి ప్రతీకారంగా మన భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్ లోని ఉగ్ర స్థావరాల పైన మాత్రమేదాడి చేసిందన్నారు. కానీ వక్రబుద్ధి గల పాకిస్తాన్ భారతదేశంలోని సరిహద్దు ప్రాంతాల పైన అమాయక ప్రజల పైన దాడి చేస్తూ యుద్ధం చేస్తుందని ఆరోపించారు. ఈయుద్ధంలో మన భారత సైన్యానికి మనమందరం ఆత్మస్థైర్యాన్ని కలిగించి మన భారతదేశ ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మొహమ్మద్ అజ్మత్ మియా, హైదర్ పాషా మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# గాయపడిన యువకుడికి పరామర్శ

అక్షర దర్బార్, తొర్రూరు : మండలంలోని హరిపిరాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ తొర్రూరు మండల అధ్యక్షుడు చెవిటి సధాకర్ కుమారుడు ప్రమాదంలో గాయపడ్డారు. ప్రస్తుతం తొర్రూరు పట్టణంలోని శ్రీ సాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంఛార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి శుక్రవారం హాస్పిటల్ కి వెళ్లి, బాధిత యువకుడిని పరామర్శించారు. అనంతరం యువకుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట నూతన ఏసీపీగా పున్నం రవీందర్ రెడ్డి నియామకం

అక్షర దర్బార్ నర్సంపేట : నర్సంపేట డివిజన్ నూతన ఏసీపీగా పున్నం రవీందర్ రెడ్డి నియామకమయ్యారు. ఖమ్మం జిల్లాలో సీసీఆర్ బీలో ఏసీపీగా పనిచేసిన పున్నం రవీందర్ రెడ్డి బదిలీపై నర్సంపేటకు రాగా ఇక్కడ ఏసీపీగా పనిచేసిన కిరణ్ కుమార్ హైదరాబాదులోని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



అక్షర దర్బార్, పరకాల : కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆల్ ఇండియా హమాలీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా తీసుకొచ్చి కార్మికులకు ఉరితాళ్లుగా మారుస్తున్నారని, వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ఈనెల 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో హమాలీ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హమాలీ సంఘం నాయకులు సాంబయ్య, మోహన్, రాజమౌళి, రాజు, రమేష్, జంపయ్యతో పాటు 50 మంది కార్మికులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

అక్షర దర్బార్, తొర్రూరు : ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ధ్వజమెత్తారు. శుక్రవారం మండలంలోని కర్కాల, హరిపిరాల గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్ని సంచులు, లారీల కొరతను నిరసిస్తూ.. రైతులు ధర్నా చేపట్టారు. స్పందించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సంఘటన స్థలానికి చేరుకొని మహబూబాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరబ్రహ్మయ్య కు ఫోన్ చేసి రైతులు ఎదుర్కొంటున్న బాధలను వివరించారు. స్పందించిన అడిషనల్ కలెక్టర్ రెండు లారీలను పంపించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ... రాష్ట్రంలో రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కోసం రైతులు దయనీయ పరిస్థితిలో ఎదురు చూస్తున్నారని, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అనాడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కేసీఆర్ గ్రామగ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతు నష్టపోకుండా ప్రతి రైతుకు మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టి పంట కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వారి వెంట బీఆర్ఎస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# జగన్నాటకం!

అభివృద్ధికి ఆమడ దూరం... మల్లక్కపేట ఆలయం

హుండీ ఆదాయం తక్కువ, పర్సనల్ ఆదాయం ఎక్కువ

అన్నీ తానై వ్యవహరిస్తున్న అయ్యగారు

పట్టించుకోని దేవదాయ శాఖ

అక్షరదర్బార్, పరకాల: పరకాల ప్రాంతంలో కొంగుబంగారంగా కొలిచే ఆరాధ్య దైవం శ్రీ మల్లక్కపేట ఆంజనేయస్వామి ఆలయం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటుంది. ఆలయానికి భక్తులు వేల సంఖ్యలో వస్తే ఆలయానికి వచ్చే హుండీ ఆదాయం మాత్రం రూ.వందల్లో మాత్రమే కనబడుతుంది. ఈ క్రమంలో ఎక్కువ ఆదాయం ఒకరి చేతుల్లోకే పోతుందని ఇక్కడ టాక్. గుడి ఆయనదే.. ఆదాయం ఆయనదే అనే నినాదం పరకాల మండలంలోని మల్లక్కపేట శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో వినపడుతుంది.

**- టెండర్లు వారివే ఆదాయం వారిదే**

మల్లక్కపేట ఆంజనేయ స్వామి ఆలయంలో మాల భిక్షకు ఆలయ అర్చకుడు ఒక బినామీ పేరుతో వేలం పాడి రూ.6.45 లక్షలకు టెండర్ తీసుకున్నాడు. ఆ టెండర్ ప్రకారం మాలలు వేయడంతో పాటు బిక్ష పెట్టుకునేందుకు అవకాశం ఉంటుంది. ఒకరికి మాల వేస్తే రూ.200కు అయ్యగారు టోకెన్ ఇస్తారు. ఒక్క రోజే 5 లక్షల నుండి 8 లక్షలు వచ్చినట్లు భక్తులు చెపుతున్నారు. ఆలయంలో దాతల సహకారంతో నిత్య అన్నదానం జరుగుతుంది. నిత్య అన్న దానానికి భక్తులే అన్ని సౌకర్యాలు కల్పిస్తారు.. కానీ, ఆలయ అర్చకుడు మాత్రం ప్రతి భక్తుని వద్ద రూ.30 వసూలు చేసి అన్నదానం చేస్తారు. ఆ రూ.30 కూడా అయ్యగారు సొంతానికే వాడుకుంటారని, ఆ రూ.30 గోశాల పేరుతో వసూలు చేస్తున్నారని పలువురు తెలిపారు. ప్రతిరోజు 500 నుండి 1000 మంది భక్తులు గుడిలో భిక్ష చేస్తారు. గోశాల పేరుతో వసూలు చేస్తున్న డబ్బులతో గోవులకు కూడా సక్రమంగా దాణా పెట్టట్లేదని, ఇంతకుముందు ఒక గోవు అమ్మకం జరిగిందనే ఆరోపణలు దుమారం లేపినట్లు సమాచారం.

**- శని పూజలు..**

ఆలయంలో శని పూజలకు దేవదాయశాఖ ఆదేశాల మేరకు కమిటీ నిర్ణయించిన ప్రకారం రూ.516 తీసుకుంటే సరిపోతుంది. కానీ అయ్యగారు మాత్రం ఒక్కొక్కరి నుంచి శని పూజ చేసుకుంటే రూ.5,000 నుంచి రూ.10,000 తీసుకుంటున్నారని ఆలయ కమిటీ చెపుతుంది. దీనిపై అయ్యగారును కమిటీ అడిగితే నా ఇష్టం, ఎంతైనా తీసుకుంటాను, మీ ఆలయానికి కావాల్సిన రసీదు మీరు తీసుకోండి అని సమాధానం చెప్పినట్లు తెలుస్తుంది.

**అయ్యగారు ప్రైవేట్ సైన్యం.**

ఆలయంలో అయ్యగారుకు ప్రైవేట్ సైన్యం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. అయ్యగారుకు రావాల్సిన ఆదాయం ప్రైవేట్ సైన్యమే వసూలు చేసి పెడుతుందని తెలుస్తుంది. వారు మాలలు వేసుకున్న తర్వాత భక్తులను గురుదక్షిణ పెట్టాలని అడగడంతో పాటు గుడిలోనే రూ.ఐదు దండను రూ.50కు భక్తులకు అమ్ముతుంటారని సమాచారం. అయ్యగారుకు పూజలో ఏమైనా సమస్యలు వస్తే వెంటనే ప్రైవేట్ సైన్యం రంగంలోకి దిగి అన్నింటిని సమకూరుస్తుందని తెలిసింది.

**- కొబ్బరికాయ రూ.50**



మల్లక్కపేట ఆలయంలో కొబ్బరికాయకు అత్యధికంగా రూ.50 వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఒక కొబ్బరికాయ ధర బయట రూ.20 ఉంటే ఆలయంలో మాత్రం రూ.50 పెట్టి తీసుకోవాల్సిందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

**- సీనియర్ అసిస్టెంట్ చేతివాటం.**

ఆలయంలో ఉన్న సీనియర్ అసిస్టెంట్ అర్చన టికెట్లలో చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దేవదాయశాఖకు సంబంధించిన బుక్ లోనివి కొన్ని టికెట్లను చింపిన తర్వాత మిగతా టికెట్లను తన సొంత బుక్ నుంచి ఇస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై నూతనంగా వచ్చిన చైర్మన్ మందలించాడని తెలిసింది. ఈ సీనియర్ అసిస్టెంట్ అయ్యగారుకు, ఆలయ ఉద్యోగులకు సమన్వయకర్తగా ఉంటారని ప్రచారంలో ఉంది.

**- అయ్యగారు ఆదాయమే ఎక్కువ.. గుడికి ఆదాయం నో**

**- ఆలయ చైర్మన్ అంభీరు మహేందర్**



ఆలయం మొత్తం అయ్యగారిది అన్నట్లు వ్యవహరిస్తున్నారని, ఆలయంలోని ప్రతి ఆదాయం అయ్యగారు సొంతానికే పోతుంది కానీ ఆలయానికి ఏమాత్రం ఇన్‌కమ్ సమకూరడం లేదని ఆలయ చైర్మన్ అంభీరు మహేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయంలో ఆయన సైన్యం ఉందని, బినామీ పేరుతో మాలలు, భిక్ష అమ్ముతున్నది నిజమేనని పేర్కొన్నారు. దీనిపై అయ్యగారును మందలించడం జరిగిందని, మీరు ఏం చేసుకున్నా మేము ఇక్కడ నుంచి వేరే కాడికి ట్రాన్స్ ఫర్ అయితం.. కానీ మాకు ఏం జరగదని, ఏం జరిగినా చూసుకుంటామని అయ్యగారు అంటున్నారని చైర్మన్ తెలిపారు. ఆలయంలో వచ్చే భక్తులకు కూడా సరైన పూజలు చేయట్లేదని పలువురు భక్తులు పేర్కొంటున్నారని తెలిపారు. ఆలయంలోని గోశాలకు ఆలయానికి సంబంధం లేదని, గోశాల అయ్యగారు సొంతంతోనే నిర్వహిస్తున్నారని తెలిపారు.

**- గోశాలకు గుడికి సంబంధం లేదు.**


**ఆలయ ఈవో వెంకటయ్య.**

గోశాలకు గుడికి సంబంధం లేదని ఆలయ ఈవో వెంకటయ్య 'అక్షరదర్బార్'కు తెలిపారు. ఆలయంలో సమస్యలపై నిఘా పెంచామని, ఆలయంలో అవకతవకలు ఏమైనా జరుగితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలోని నాణ్యమైన విద్య

పరకాల ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు.


అక్షర దర్బార్, పరకాల : ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ ఎస్. రమాదేవి అన్నారు. జిల్లా పరిషత్ బాలికల సెకండరీ పాఠశాల పరకాలలో సెర్ప్ మహిళా సంఘాల అధ్యక్షులు, పాఠశాల హెచ్ఎంలతో ఏర్పాటు చేసిన కన్వర్జెన్స్ సమావేశానికి ఎంపీడీఓతో పాటు ఎంఈఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విశాలమైన గదులు, గ్రౌండ్ , క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉంటారని అన్నారు. ఉచితంగా పుస్తకాలు, టిఫిన్, భోజనం, డ్రెస్ లు అందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం క్రింద మైనర్ రిపేర్లు, మరుగుదొడ్లు , ఎలక్ట్రిసిటీ మొదలగు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసిందని, తల్లితండ్రులు ప్రభుత్వ పాఠశాలలో సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా సీఎంఓ బి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మహిళా సంఘాలు సమన్వయ చేసుకుని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం క్రాంతి, మండల నోడల్ అధికారి నామాని సాంబయ్య, జడ్పీఎస్ఎస్ హెచ్ఎంలు సురేందర్, మధు, వివిధ పాఠశాలల హెచ్ఎంలు మహిళా సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.




# శరవేగంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణం

అక్షర దర్బార్ మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండల కేంద్రంలో 30 లక్షల రూపాయల వ్యయంతో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎలకంటి యుగేంద్ర చారి తెలిపారు ఎన్నో ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోక పనులు స్తంభించిన తరుణంలో ఎలకంటి యుగేంద్ర చారి, తక్కల్లపల్లి శంకరమూర్తి, ఎలకంటి ముత్తిలింగ చారి ఆధ్వర్యంలో.. నిధులు సమీకరించి పనులను ప్రారంభించారు. అనతి కాలంలోనే నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 50 శాతం పనులు కాగా అతి త్వరలోనే శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాన్ని అంగరంగ వైభవంగా ప్రారంభిస్తామని స్థానిక విలేకరులకు తెలిపారు. వీరబ్రహ్మేంద్ర స్వామి భక్తులు ఆలయ నిర్మాణానికి సహకరించాలని వారు కోరారు. ఆలయం పూర్తయిన తర్వాత ఆలయ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలకంటి రవీంద్ర చారి, ఎలకంటి రమేశ్, వీణవంక ప్రసాద్, నవీన్, వీణవంక లక్ష్మీరాజ్యం, చెల్లోజు నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు





# ‘ప్రెజర్’ బాంబ్ బ్లాస్ట్

## తిరుమలగిరిలోనే ఫస్ట్ !

- భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో ఘటన
- మూడు దశాబ్దాల క్రితమే సంచలనం
- బ్లాస్టింగ్‌లో ఇద్దరు సామాన్యులు మృతి
- అప్పటి ఎస్సై రవీందర్ రెడ్డికి గాయాలు
- ఏఎస్సైకి తృటిలో తప్పిన ప్రమాదం
- కర్రెగుట్టల్లో కూంబింగ్ నేపథ్యంలో మరోసారి ప్రెజర్ బాంబ్‌పై చర్చ

– అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి : వంట చేసుకునేందుకు కట్టెలు సేకరించేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లి నాగరాజు అనే ఆదివాసీ ప్రెజర్ బాంబుపై కాలు వేశాడు. పెద్ద బ్లాస్టింగ్ సంభవించింది. నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ ఘటన 2025 జనవరి 5న ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలం వీరభద్రవరంలో జరిగింది. ఆ తర్వాత వెంకటాపురం, వాజేడు మండలాల పరిధిలో ప్రెజర్ బాంబులు పేలి పలువురు గాయపడ్డారు. తాజాగా ఆపరేషన్ కర్రెగుట్టలో భాగంగా కొద్ది రోజుల క్రితం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో కర్రెగుట్టపై ప్రెజర్ బాంబ్ పేలి ఓ జవాను ప్రాణాలు కోల్పోయాడు. ఇటీవల మావోయిస్టులు తెలంగాణ, ఛత్తీస్ గడ్ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న కర్రెగుట్టపై ప్రెజర్ బాంబులను అమర్చామని, పోలీసుల మాటలు విని ప్రజలెవరు కర్రెగుట్టపైకి రావద్దని మావోయిస్టు పార్టీ ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో ఓ లేఖ విడుదలైంది. ఈ క్రమంలో తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో పోలీసుల కూంబింగ్ మొదలైంది. ఇక్కడ భద్రతా దళాలు ఉధృతంగా ‘ఆపరేషన్ కగార్’ ను కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు.. ప్రెజర్ బాంబ్ అంటే ఏమిటి..? తెలుగు ప్రాంతంలో మొదటి సారి



ప్రెజర్ బాంబ్ ఎక్కడ పేలింది.. ? దాన్ని ఎవరు పేల్చారు..? ప్రాణ నష్టం ఏమైనా సంభవించిందా? అనే విషయం తెలుసుకోవాలంటే ఈ కథనం పూర్తిగా చదవాల్సిందే..

ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం అటవీ ప్రాంతంలో పలుచోట్ల ప్రెజర్ బాంబులు అమర్చామని, అటువైపు వెళ్లకూడదని మావోయిస్టు పార్టీ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 8వ తేదీన హెచ్చరికలు వచ్చాయి. ఆదివాసీలు జాగ్రత్తగా ఉండాలని గూడేల్లో పోస్టర్లు సైతం వెలిశాయి. మావోయిస్టుల హెచ్చరికలను సీరియస్‌గా తీసుకున్న భద్రతా దళాలు రంగంలోకి దిగాయి. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని కర్రెగుట్టను జల్లెడ పడుతున్నాయి. అక్కడ 20 రోజులుగా ‘ఆపరేషన్ కగార్’ కొనసాగుతున్నది.

### – మూడు దశాబ్దాల క్రితం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 90 ప్రాంతంలో ఉధృతంగా పీపుల్స్‌వార్ ఉద్యమం నడిచింది. నాడు నక్సలైట్లు తమ విప్లవోద్యమానికి నాటు తుపాకులు విరివిగా వినియోగించారు. కొన్నిసార్లు పోలీస్ స్టేషన్లు ధ్వంసం చేసి.. అక్కడి తుపాకులను అపహరించేవారు. ఆ తర్వాతి కాలంలో ప్రెజర్ బాంబు గురించి తెలుసుకున్న నక్సలైట్లు దానిపై దృష్టి సారించారు. అందుకు తక్కువ ఖర్చుతో బాంబ్ తయారు చేయగలిగే వెసులుబాటు ఉండడమే కారణం.

### – తయారీకి తక్కువ ఖర్చు

ప్రెజర్ బాంబు తయారీకి మావోయిస్టులు ప్రధానంగా ప్రెజర్‌కుక్కర్‌ను వినియోగిస్తున్నారు. కుక్కర్‌లో పేలుడు పదార్థాన్ని చొప్పించి.. దానికి పిన్ అమరుస్తారు. బాంబ్ సిద్ధమైన తర్వాత దానిని.. అటవీప్రాంతాల్లో పోలీసులను టార్గెట్ చేస్తూ అమరుస్తున్నారు. ఎవరైనా తెలియకుండా బాంబ్‌పై అడుగు వేస్తే.. అది సెకన్లలో పేలుతుంది. బ్లాస్టింగ్ వల్ల ఒక్క పోలీసులే కాదు.. అభం శుభం తెలియని ఆదివాసీలు సైతం ప్రాణాలు కోల్పోతున్నారు.





### తిరుమలగిరిలో మొదటిసారి బ్లాస్ట్..

ఉమ్మడి ఆంధ్రా పాలనలో అప్పటి వరంగల్ జిల్లా.. ఇప్పటి భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో మొట్టమొదటిసారి 1997లో పీపుల్స్ వార్ నక్సలైట్లు ప్రెజర్ బాంబును అమర్చారు. నాడు నక్సలైట్లు తిరుమలగిరి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న ఒక చెట్టుకు బొమ్మను వేలాడదీసి, దానిలో ప్రెజర్ బాంబు ఏర్పాటు చేశారు. సమాచారం అందగానే ఆ సమయంలో రేగొండ పోలీసు స్టేషన్ లో ఎస్సైగా పనిచేసిన రవీందర్ రెడ్డి తమ సిబ్బందితో తిరుమలగిరి గ్రామానికి చేరుకున్నారు. తమను లక్ష్యంగా చేసుకుని 'వార్' నక్సలైట్లు పెట్టి ఉంటారని పోలీసులు ఈ బొమ్మను తొలగించలేదు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అందుబాటులో ఉన్న వ్యక్తులను పిలిచారు. నక్సలైట్లు అమర్చిన దిష్టిబొమ్మను తొలగించాలని కొందరికి చెప్పారు. దీంతో స్థానికులు కొందరు నక్సలైట్లు చెట్టుకు వేలాడదీసిన బొమ్మను తొలగించే క్రమంలో ఆ బొమ్మలో ఉన్న ప్రెషర్ బాంబు పెద్ద శబ్దంతో పేలింది. ఈ బ్లాస్టింగ్‌లో తిరుమలగిరికి చెందిన సుంకరి రాజయ్య, వృత్తి పని కోసం తిరుమలగిరికి వచ్చిన చిన్నకోడెపాకకు చెందిన సాదు జంపయ్య మృతిచెందారు. ఇదే ఘటనలో ఎస్సై రవీందర్‌రెడ్డి, గ్రామ సేవకుడు ఐలయ్య గాయాలపాలయ్యారు. ఎస్సై వెంట ఉన్న ఏఎస్సై ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. పీపుల్స్ వార్ ఇక్కడ చేసిన ప్రెజర్ బాంబు తొలి ప్రయోగం అప్పట్లో యావత్ ఉమ్మడి రాష్ట్రాన్ని కుదిపేసింది. వార్ నక్సలైట్లు పేలుడు సామాగ్రి వినియోగించి ప్రెజర్ బాంబ్ లను కూడా తయారు చేస్తున్నారనే సంకేతాలు.. తిరుమలగిరి ఘటన తర్వాతే నాటి ప్రభుత్వానికి అందాయి. ఆ తర్వాత పీపుల్స్ వార్ నక్సలైట్లు ప్రెజర్ బాంబులను విస్తృతంగా వినియోగించారు. ఉగ్రవాదులు కూడా ప్రెజర్ బాంబులు వినియోగించడం ప్రారంభించారు. వార్ నక్సలైట్లు అప్పట్లో తమ టార్గెట్లపై దాడులకు రేగొండ మండలాన్ని ఒక ప్రయోగశాలగా చేసుకోవడం విశేషం.



# ముమ్మరంగా మినీ ట్యాంక్ బండ్ పనులు

### మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్

అక్షర దర్బార్, తొర్రూరు : పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం తొర్రూరు మున్సిపాలిటీలోని పెద్ద చెరువు దగ్గర నడుస్తున్న మినీ ట్యాంక్ బండ్ పనులను తొర్రూరు మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ... ట్యాంక్ బండ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఎక్కడ రాజీ పడకుండా పనుల్లో నాణ్యత పాటించాలని, తొర్రూరు పట్టణాభివృద్ధిలో ట్యాంక్ బండ్ చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రంజిత్, హెల్త్ అసిస్టెంట్ రాజు, కాంట్రాక్టర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఎస్టీల అభ్యున్నతికి 'ఇందిరా సౌరగిరి'

- నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి శ్రీకారం
- ఆర్వోఎఫ్ భూముల సాగుకు సర్కార్ చేయూత
- ఈ నెల సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- గిరిజనులకు : లబ్ధి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి: గిరిజనులు, ఆదివాసీల అభ్యున్నతి కోసం తెలంగాణ ప్రభుత్వం 'ఇందిరా సౌరగిరి జలవికాసం' పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 18న నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరులో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పథకం ప్రారంభం కానున్నది. పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్టీలకు మేలు జరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ చట్టం కింద కేటాయించిన భూములను పూర్తిస్థాయిలో సాగులోకి తీసుకురావాల్సి ఉందని వివరించారు. వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో సర్కార్ రూ.12,600 కోట్ల అంచనాతో పథకాన్ని అమలు చేస్తుందని స్పష్టం చేశారు. రానున్న ఐదేళ్లలో 2.10 లక్షల మంది రైతులకు 6 లక్షల ఎకరాల్లో సాగునీటిని అందించడమే పథకం లక్ష్యమని వివరించారు. దేశంలోని ఏ రాష్ట్రంనూ పోడు భూములను సాగు చేసుకునేందుకు ఇంత భారీగా నిధులు కేటాయించలేదని, పథకం ద్వారా గ్రామాల్లో జియోలాజికల్ సర్వేనిర్వహిస్తామని తెలిపారు. బోర్లు వేయిస్తామని, సోలార్ పంపుసెట్లు బిగిస్తామన్నారు. అలాగే అవకాడో, వెదురు, దానిమ్మ, డ్రాగన్, అంజీర్ వంటి పంటల సాగు, ప్రకృతి సేద్యంపై గిరిజనులకు అవగాహన కల్పిస్తామన్నారు. సమీక్షలో రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వ్యవసాయ, గిరిజన సంక్షేమ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.





# మిర్చి ధర క్వింటాకు రూ.10,374

- ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులకు శుభవార్త
- 'ఎంఐఎస్' పథకం అమలు చేయనున్న కేంద్రం
- బహిరంగ మార్కెట్‌లో ధర తక్కువగా ఉంటే.. రైతుకు కేంద్రమే భర్తీ
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన





అక్షరదర్బాదర్, ప్రధాన ప్రతినిధి: మార్కెట్ జోక్యం పథకం (ఎంఐఎస్) కింద కేంద్ర వ్యవసాయశాఖ తెలంగాణలో రైతులు పండించిన మిర్చికి క్వింటాకు రూ.10,374 చొప్పున ధర నిర్ణయించింది. బహిరంగ మార్కెట్లో ఇంతకంటే తక్కువ ధరకు రైతులు మిర్చి విక్రయించాల్సి వస్తే.. మిగిలిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే చెల్లించనున్నది. పథకంపై తాజాగా కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన విడుదల చేశారు. రైతులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మిర్చి సాగులో తెలంగాణ యావత్ దేశంలోనే ముందంజలో ఉంది. కేంద్రం ప్రకటనతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ రైతులకు మేలు జరుగనున్నది. ఆయా జిల్లాల్లో ఏటా విస్తారంగా మిర్చి సాగవుతుంది. అలాగే ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ విస్తారంగా మిర్చి సాగవుతున్నది.

## కిషన్‌రెడ్డి చొరవతో..

సాగు ఖర్చులకన్నా మార్కెట్ ధర తక్కువగా ఉన్నందున రైతులు నష్టపోతున్నారని ఏప్రిల్ 4న కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లేఖ రాసి ఆదుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాశారు. అందుకు స్పందించిన కేంద్ర వ్యవసాయశాఖ స్పందించింది. 2024 -25లో రాష్ట్రంలో చేతికొచ్చిన 6,88,540 మెట్రిక్ టన్నుల్లో 25 శాతానికి ఎంఐఎస్ వర్తింపజేస్తామని హామీ ఇచ్చింది. మార్కెట్ -విక్రయ ధరల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలుత రాష్ట్రప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది. ఆ తర్వాత కేంద్రం అందులో 50శాతం మొత్తాన్ని రాష్ట్రాలకు తిరిగి చెల్లిస్తుంది. ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50శాతం చొప్పున భరించాల్సి ఉంటుంది. పథకం ఏపీఎంసీల్లో విక్రయించే మిర్చికి మాత్రమే వర్తిస్తుంది. కొన్నిచోట్ల దళారులు క్వింటా మిర్చిని రూ.5-6 వేలకే కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నట్లు తెలియడంతో కేంద్రం ప్రత్యేకంగా పథకం అమలు చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం కూడా మిర్చి రైతులకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్రప్రభుత్వానికి సూచిస్తున్నారు.

# తెలంగాణ జిల్లాల్లో జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్ళు



- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

తెలంగాణ జిల్లాల్లో పని చేస్తున్న జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలైన జర్నలిస్టులకు అలాగే వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతనివ్వనున్నట్లు ఆయన చెప్పారు.

శుక్రవారం హైదరాబాద్ మీడియా అకాడమిలో జరిగిన కార్యక్రమంలో జర్నలిస్టుల కుటుంబాలకు, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు మంత్రి శ్రీనివాస్ రెడ్డి భరోసా చెక్కులు అందించారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనాన్ని చిన్న చిన్న మరమత్తులు పూర్తి చేసుకుని ఈ నెల చివరిలోగా ప్రారంభిస్తామని తెలిపారు. విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 42 కోట్లను ఫిక్సెడ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమి ఖర్చు పెడుతోంది. జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్సెడ్ డిపాజిట్ పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు 22 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి లక్ష రూపాయతో పాటు పాటు అయిదు సంవత్సరాల వరకు నెలకు మూడు వేల రూపాయలు పెన్షన్, వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల క్రింద ఒకటి నుండి 10వ తరగతి వరకు చదివే వారికి నెలకు వెయ్యి రూపాయలు చొప్పున ఒక్కో కుటుంబంలో గరిష్టంగా ఇద్దరికి అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు అర్. యస్.రఘురామరెడ్డి, మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, జర్నలిస్ట్ యూనియన్ నేత విరాహత్ పాల్గొన్నారు.

# సాక్షి ఎడిటర్‌పై దాడిని ఖండించిన పాత్రికేయులు

- హనుమకొండ జిల్లా కేంద్రంలో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నిరసన

అక్షరదర్బార్, హనుమకొండ: సాక్షి తెలుగు దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనుంజయ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ పోలీసులు అక్రమంగా దాడులు జరిపి, శోధనలు నిర్వహించిన చర్యలను పాత్రికేయులు, జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. పత్రికా స్వేచ్ఛను కాలరాసే విధంగా ఏపీ పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, ఏపీ ప్రభుత్వ తీరుపై నేతలు మండిపడ్డారు. ఈ నేపథ్యంలో శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సాక్షి పాత్రికేయులు, జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని ఏపీ పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇంచార్జి గడ్డం రాజిరెడ్డి, ఎడిషన్ బాధ్యులు లింగయ్య, పాత్రికేయులు, యూనియన్ ప్రతినిధులు తోట సుధాకర్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, టీయూడబ్ల్యూజేఐజేయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, రాష్ట్ర నాయకులు వల్లాల వెంకటరమణ, వేణుమాధవ్, 143 ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మస్కపురి సుధాకర్, రాజ్ కుమార్, స్టాఫర్ వాంకే శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు పిన్నా శివకుమార్, అల్లం రాజేష్ వర్మ, సదానందం, ఎలక్ట్రానిక్ మీడియా, ఫోటో జర్నలిస్టు సంఘాల నుంచి తిరుపతి, గొట్టే వెంకట్, సంపేట వెంకటేశ్వర్లు, వరప్రసాద్,డెస్క్ జర్నలిస్టులు మహేష్, ఓంకార్, ఐజేయు-టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు ఊటుకూరు సాయిరాం, సీనియర్ జర్నలిస్టులు అల్వాల సదాశివుడు, కోలా కృష్ణకుమార్ రెడ్డి, అహమ్మద్ , బత్తిని రాజేందర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన వివిధ మండలాల రిపోర్టర్లు పెద్ద సంఖ్యలో హాజరై, తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.

